18న టీహబ్‌లో జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఈనెల 18వ తేదీన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్(జీసీసీ) ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం 3.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, సైయింట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ తదితరులు ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. కార్యక్రమంలో 50కిపైగా స్టార్టప్‌ల ప్రతినిధులు,400పైగా వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎం సహాయనిధి



సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసా నిస్తోందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రాంగూడకు చెందిన భగవాన్‌దాస్ అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా ఆయనకు మంజూరైన రూ.70వేల చెక్కును బుధవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్: ఎంసీపీఐయూ వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ వనం సుధాకర్ పిలుపునిచ్చారు. మియాపూర్ కాలనీలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు సంబంధించిన కరపత్రాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తొలిదశ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అని అన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ హైదరాబాద్ కమిటీ సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, కమిటీ సెక్రటరీ సభ్యులు సుకన్య, గ్రేటర్ కార్యదర్శి వర్గ సభ్యులు కళావతి, అంగడి పుష్ప, మురళి, భాగ్యమ్మ, రాణి, సుల్తానాబేగం, శివాని తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

పటాన్‌చెరు టౌన్: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి సూచించారు. బుధవారం పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ పరిధిలోని గోశాలలో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, సర్దార్, చంద్రశేఖర్, సుజాత, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పురుషుల జట్టు ఎంపిక



సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ సెలక్షన్ ట్రయల్స్‌ను బుధవారం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ ట్రయల్స్‌లో వివిధ కళాశాలల నుంచి సుమారు 150 మంది పాల్గొన్నారు. జేఎన్‌టీయూహెచ్ సెక్రటరీ, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా.నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు క్రైస్ట్ యూనివర్సిటీ బెంగళూరులో జరిగే సౌత్ జోన్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననుంది. బాస్కెట్ బాల్ కోచ్ అమృత్‌రాజ్ పర్యవేక్షణలో సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పురుషుల జట్టు సెలక్షన్ జరిగింది. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ కంట్రోల్ ట్యాంక్ పొంగి కాలనీలోకి రావడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించి జీహెచ్ఎంసీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాన్‌హోల్స్ అన్ని శుభ్రం చేయించి, నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని, కాలనీలో పెద్ద డ్రైనేజీ లైన్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మార్నెళ్ల శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, పోశెట్టి గౌడ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.

వాహనాలపై నకిలీ స్టిక్కర్లు తొలగింపు

స్పెషల్ డ్రైవ్‌లో 75 మందికి జరిమానాలు

బంజారాహిల్స్: నకిలీ స్టిక్కర్లతో తిరుగుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. బుధవారం ఉదయం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై స్టిక్కర్లు అంటించి తిరుగుతున్న వారికి జరిమానాలు విధించారు. నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో ఈ నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసు, ప్రభుత్వ వాహనం, ప్రెస్, ఆర్మీ.. ఇలా నకిలీ స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న వారి వద్ద డాక్యుమెంట్లు పరిశీలించి నకిలీవని తేలడంతో 75 మందిని గుర్తించి అక్కడికక్కడే వాటిని తొలగించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. రెండు గంటల వ్యవధిలోనే 75 వాహనాలు కనిపించాయన్నారు.

పుస్తక నిక్షిప్త కేంద్రం తెరవరు.. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయరు

రాయదుర్గం: పుస్తక నిక్షిప్త కేంద్రంపై ఆశలు వదులుకోగా... డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కూడా పత్తా లేకుండా పోయింది.హైటెక్ డివిజన్‌గా పేరొందిన గచ్చిబౌలిలో కనీసం లైబ్రరీ లేకపోవడం, ఆ తర్వాత ఏర్పాటు చేస్తామన్న డిజిటల్ లైబ్రరీ విషయం కూడా అందరూ మరిచిపోయినట్లుందని యువత, విద్యావేత్తలు, విద్యార్థులు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో పుస్తక పఠనంపై అందరిలోనూ ఆసక్తి కనబడుతోంది. ఈ నేపథ్యంలో వీటిపై జీహెచ్ఎంసీ, జిల్లా గ్రంథాలయ సంస్థ రెండూ దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాటు చేసిన రెండేళ్లకే మూత

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రాయదుర్గంలో ఇందిరాగాంధీ పుస్తక నిక్షిప్త కేంద్రం (బుక్ డిపాజిట్ సెంటర్)ను 13 అక్టోబర్, 2013లో ఏర్పాటు చేశారు. రెండేళ్లపాటు ఇది బాగా నడిచింది. దినపత్రికలు, గ్రంథాలు, పుస్తకాలు చదివేందుకు చాలామంది ఆసక్తి కనబర్చారు. కానీ ఆ తర్వాత నిర్వహణ భారం కారణంగా రెండేళ్ల తర్వాత మూసివేశారు. మళ్లీ పుస్తక నిక్షిప్త కేంద్రం రూపంలో లైబ్రరీని ఏర్పాటు చేయాలనే దానిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి దృష్టి పెట్టలేదు. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపి బుక్ డిపాజిట్ సెంటర్లతోపాటు పేపర్ రీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రాయదుర్గంలో పుస్తక నిక్షిప్త కేంద్రం ఏర్పాటు చేసిన భవనం



11 ఏళ్ల క్రితం వేసిన శిలాఫలకం ఇదే..

డిజిటల్ లైబ్రరీ

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితం డివిజన్‌కు ఒక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఆ తర్వాత కొన్నిచోట్ల స్థలాలు, భవనాలను పరిశీలించినా, వీటి ఏర్పాటుపై ఆసక్తి చూపలేదు. డిజిటల్ లిటరసీని పెంచేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు, భారీ అపార్ట్‌మెంట్లు, జీపీఆర్ఏ క్వార్టర్స్ (కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయం), టీఎన్‌జీఓ కాలనీ, సెక్రటేరియట్ కాలనీలలో ఏర్పాటు చేయాల్సిన అవసరముందంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

నవంబర్ 9,10 తేదీల్లో ఓటరు నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: నవంబర్ 9 ,10 తేదీల్లో ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుందని ఓటరు నమోదు అధికారి దేవుజా అన్నారు. బుధవారం పటాన్‌చెరు తహశీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.అనంతరం ఓటరు జాబితాలో గతంలో జరిగినట్టు అవకతవకలు జరగకుండా చూడాలని ఓటర్ నమోదు అధికారిని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రంగారావు, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మనూలో ముగిసిన వర్క్‌షాప్



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: ఉర్దూ పాఠ్య పుస్తకాల తయారీ బృహత్తర బాధ్యత అని మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), భారతీయ భాషా సమితి(బీబీఎస్) 'మనూ' సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉర్దూ రచయితల వర్క్‌షాప్ ముగింపు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ బీబీఎస్ నోడల్ అధికారి ప్రొఫెసర్ గుర్పాల్‌సింగ్, డెక్కన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ .వనజ ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందించారు.

గ్యార్వీ షరీఫ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అనిరుధ్ యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: గ్యార్వీ షరీఫ్ వేడుకలను మంగళవారం రాత్రి ఓల్డ్ లింగంపల్లిలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి విలేజ్ అధ్యక్షులు గడ్డం రవియాదవ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, గఫార్, అజీమ్, సాయి, ముంతాజ్ బేగం, మొయిన్, మోయిస్, అజార్, రెహానా బేగం తదితరులు పాల్గొన్నారు.

రూ.749.15 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: ఆస్తి పన్ను రూ.749.15 కోట్లు లక్ష్యంగా వంద శాతం వసూలు చేయాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.749.15 కోట్లు టార్గెట్ అని ఇప్పటి వరకు రూ.299.35 కోట్లు వసూలు చేశారని తెలిపారు. వేడుకలు, పండుగల సందర్భంగా సెలవు దినాలు రావడంతో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతి మందగించిందన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని డాకెట్లలో ఆస్తి పన్ను వసూలు ఆశాజనకంగా లేదని, సంబంధిత ఏఎంసీలు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు ఆర్సీపురం సర్కిళ్లలోని 34 డాకెట్లలో వసూళ్ల తీరును సమీక్షించారు. ఉప కమిషనర్లు, ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవం



కొత్తగూడలో నాభిశిల ప్రతిష్ఠ

గచ్చిబౌలి: భక్తుల ప్రత్యేక పూజల మధ్య నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొత్తగూడలో నాభిశిల ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవతామూర్తులకు ఉష్ణోదక స్నానం, అభిషేకం, తైల లేపనం మంత్ర, యంత్రస్థాపన, మూర్తిస్థాపన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు. అన్నదానం నిర్వహించారు. అనంతరం గడప కడుగుట, పంబళ్లు, పోతురాజుల బండ్లు, ఒగ్గు పని వాళ్ల సమక్షంలో గ్రామ ఎదుర్కోలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయంలో పాత రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రౌడీషటర్లు నేరాలకు పాల్పడకుండా ఉంటే రౌడీషీట్ రద్దు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం వారి కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఎంఐజీ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు, సర్కిల్ ఉప వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని పార్కుల వద్ద ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించాలని శానిటేషన్ విభాగం సిబ్బందికి సూచించారు. కాలనీవాసులు చెత్తను తడి, పొడిగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందజేసి కాలనీ పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్తను రోడ్డుపై వేసిన వారికి జరిమానాలు విధిస్తామని శేరిలింగంపల్లి సర్కిల్ ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్‌ను 21 రోజుల పాటు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ డైరెక్టర్లు వెంకట్‌రావు, సుబ్బారావు, నారాయణగౌడ్, శానిటరీ సూపర్‌వైజర్ వెంకట్, ఎస్ఆర్‌పీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు రెసోనెన్స్ విద్యార్థులు

మాదాపూర్: రీజనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌కు రెసోనెన్స్ విద్యార్థులు ఎంపిక అయ్యారని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. మాదాపూర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతి కష్టమైన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు.

చండీ హోమం

మూసాపేట: మూసాపేట భవానీనగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో బుధవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, చండీ హోమం ,రుద్రహోమం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. గురువారం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం ఉంటుందని కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు..



చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం ఎదుట..

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 కార్యాలయం గేటు ముందు కాలువలో మట్టి పేరుకుపోయిందని దసరా పండుగకు ముందు పూడిక తీసి మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులు పనులు ప్రారంభించారు. పది రోజులు కావొస్తున్నా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో సర్కిల్ కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పనులు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికి మందకొడిగా సాగుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

లీకేజీతో తాగునీరు వృథా



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ అపార్ట్‌మెంట్ సొసైటీ భవన సమీపంలో మంచినీటి పైప్‌లైన్ వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. స్థానికంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ కూడా ఉండటంతో మురుగునీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఉదయం నుంచి నీరు రోడ్లపై ఏరులై పారుతుండడంతో వాటర్‌వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు అధ్వానం.. రాకపోకలు ఎలా..



అధ్వానంగా తయారైన రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం అశోక్‌నగర్ నుంచి హెచ్ఐజీ కాలనీ మీదుగా భెల్ టౌన్‌షిప్‌కు వెళ్లే మార్గం గుంతల మయంకావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు బీహెచ్ఈఎల్ సంస్థకు చెందినది కావడంతో ఇటు భెల్ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో ఈ సమస్య పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు కోసం నిధులు మంజూరు చేయించారు. కానీ రోడ్డు వేసే సమయంలో భెల్ అధికారులు అడ్డుకున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది స్కూల్ విద్యార్థులు భెల్ టౌన్‌షిప్‌లోని పాఠశాలలకు వస్తుంటారు. అలాగే కార్మికులు, ఉద్యోగస్తులు సైతం ఈమార్గం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల రోడ్డు కారణంగా వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సీనియర్ సిటిజన్‌లు ఈ మార్గంలో వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. భెల్ అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రీడాకారిణికి సన్మానం



స్వాతికి శాలువా కప్పి అభినందించిన ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ఇండోథాయ్ ఇంటర్నేషనల్ త్రోబాల్ సిరీస్- 2024 ఫర్ విమెన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించిన క్రీడాకారిణి ఎర్రగుడ్ల స్వాతియాదవ్‌ని బుధవారం ఎమ్మెల్యే గాంధీ ఘనంగా సత్కరించారు. మాదాపూర్‌కి చెందిన స్వాతి తండ్రి మధుయాదవ్, చింతకింది రవీందర్‌గౌడ్, హరికృష్ణ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ త్రోబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో అక్టోబర్ 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన పోటీల్లో స్వాతి పాల్గొంది.

ఏడీఈగా ఆదినారాయణ బాధ్యతలు స్వీకరణ

చందానగర్: చందానగర్ విద్యుత్ ఏడీఈగా ఆదినారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్‌గా దీప్తిలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏడీఈగా విధులు నిర్వహించిన శ్యామ్ ప్రసాద్ చౌటుప్పల్, ఏఈ రాజేందర్ చేవెళ్లకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో తాండూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ, సంగారెడ్డి నుంచి దీప్తిలు వచ్చారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇటీవల 20 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి 20 కోట్ల 80 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.నూతన రహదారుల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ఆన్‌లైన్‌లో స్టీల్ కొనుగోలు చేయబోయి..

సైబర్ వలలోపడి రూ.9 లక్షలు పోగొట్టుకున్న వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్‌లో స్టీల్ కొనుగోలు చేయబోయిన వ్యాపారి సైబర్ వలలో పడి రూ.9 లక్షల 78 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి అక్టోబర్ 6వ తేదీన ఇంటి నిర్మాణం కోసం స్టీల్ కొనేందుకు ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా ఓ నంబర్ దొరికింది. ఆ నంబర్‌కి ఫోన్ చేసి కావాల్సిన స్టీల్ మెటీరియల్ కోసం మాట్లాడగా అపరిచిత వ్యక్తి స్టీల్‌కు 50 శాతం నగదు చెల్లించాలని చెప్పడంతో రూ. 9 లక్షల 78 వేలు చెల్లించాడు. తర్వాత అపరిచిత వ్యక్తి స్పందించకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్నో పోలీసులమంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఫోన్ కాల్..

లక్నో పోలీసులమంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బెదిరించి అతని వద్ద నుండి రూ.4 లక్షల 28 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డివిజన్ పరిధిలోని ఓ ఐటీ ఉద్యోగికి సెప్టెంబర్ 30వ తేదీన లక్నో పోలీసులమంటూ ఫోన్ కాల్ వచ్చింది. నీ ఆధార్‌పై తీసుకున్న నంబర్‌తో అసాంఘిక కార్యక్రమాలతో పాటు మనీ లాండరింగ్ కేసులు ఉన్నాయని, వీడియో కాల్ చేసి పోలీస్ యూనిఫాంలో ఉన్న అపరిచిత వ్యక్తులు మాట్లాడారు. దీంతో భయభ్రాంతులకు గురైన ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.4 లక్షల 28 వేలు పంపాడు. తిరిగి మరలా డబ్బులు అడగడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.